# ఛ్ఛ!

## సూరేపల్లి విజయ

**స్ట్రాంగ్ కోచింగ్ సెంటర్-**
**అది ఖర్మకాలిన 'మే నెల-**
**ఆ కోచింగ్ సెంటర్ దున్నారావు తన పెద్దపెద్ద గుబురుమీసాలు మెలేసుకుంటూ విలాసంగా కుర్చీమీద కూచొని వున్నాడు.**

అది కొత్తరకమైన కోచింగ్ సెంటర్. దిక్కుమాలిన విద్యావిధానం పుణ్యమాని పిల్లలకు పుస్తకాలు మోసే నీచనికృష్టమైన పద్ధతి కోసం శిక్షణ యిస్తున్నారు. వయసుల వారీగా రెండేళ్ళు మొదలు పదమూడేళ్ళ వయసు వరకు వున్న పిల్లలు శిక్షణ పొందుతున్నారు.

ఓ వైపు పేరెంట్స్ క్యూ కట్టి అప్లికేషన్ ఫారమ్స్ పూర్తిచేసి యిస్తున్నారు. నలుగురైదుగురు ఇన్‌స్ట్రక్టర్లు చిన్నపిల్లలను లైన్‌లో నిలబెట్టి ముందు వంగోమని చెబుతున్నారు. అలా రోజూ ఓ అరగంట ప్రాక్టీసు చేయిస్తారు.

అప్పుడిహ పుస్తకాల బరువుకు వాళ్ళ వీపులు వంగినా నొప్పి తెలియదు. ఆ తర్వాత ఓ కిలో బరువువుండే తూనికలరాయి ఆ చిన్నారి వీపుమీద పెట్టి నడిపిస్తారు. ఆ కోచింగ్ సెంటర్ వన్నెలు చిన్నెలు చెప్పడమెందుకు... అస హ్యాంగా... చదివి తరించాల్సిందే.

** ** **

బలేరావు పిచ్చి టెన్షన్‌లో వున్నాడు. అటుయిటూ కాలు ప్లస్ చేయి కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. (పిల్లికి చేయుంటుందా అన్న డౌటొద్దు) అతని భార్య మందమతి మొగుడలా తిరుగుతుంటే పిచ్చి సంతోషంగా కళ్లు అరమోడ్పులు చేసుకొని చూస్తోంది.

బలేరావుకు కాలు కాలిన పిల్లిలా తిరిగితిరిగి కాళ్ళు పీకాయి. వెంటనే అలా తిరిగే ప్రోగ్రామ్ కాసేపు ఆపి, సీరియస్‌గా నిల్చొని వున్నాడు యమ టెన్షన్‌గా.

మందమతి మరింత సంతోషంగా మొగుడి వైపు చూస్తోంది. కాస్త లేట్‌గా భార్య తన వైపు సంతోషంగా చూస్తోందన్న విషయం అతని నోటీస్‌లోకి వచ్చింది.

"ఏంటీ.. నేను పిచ్చిముండాకొడుకులా వెర్రి మొహం వేసుకొని అటుయిటు తిరుగుతుంటే నీకు నవ్వొస్తోందా?" డామ్ సీరియస్‌గా అడిగాడు బలేరావు.

పుసుక్కున కిసుక్కుమని నవ్వింది మందమతి. మరింత సీరియస్‌గా చూసాడు బలేరావు.

"అట్టా చూడమాకయ్యా" స్వయంకృషిలో విజయశాంతి స్టయిల్లో అంది.

"ఏంటీ కామెడీనా?" కోపంగా అడిగాడు బలేరావు.

"అదికాదురా బలే"

"నన్ను... నన్ను రా అంటావా?"

"నీకు తెలుసు కదా... నాకు ముద్దొచ్చినా, మూడొచ్చినా రా... అంటానని" అంది మందమతి.

'మిట్టమధ్యాహ్నం... పిచ్చినా కొడుకులా టెన్షన్‌గా జిడ్డోడిన మొహంతో తిరుగుతుంటే నీకు మూడొచ్చిందా? మాడు పగులుద్ది..." గంభీరంగా అన్నాడు బలేరావు.

మళ్ళీ కిసుక్కున నవ్వి ఎవరి మాడు రోజూ పగులుద్దో నెత్తిమీద బొడిపెలు చూసుకుంటే తెలుస్తుంది" అంది.

బలేరావు వెంటనే తన నెత్తిమీద బొడిపెలు చూసుకుంటూ...

"చాల్చాల్లే... యింతకీ ఎందుకు నవ్వావు?"

"మీరు టెన్షన్‌గా తిరుగుతుంటే రైలులో టాయ్‌లెట్ ముందు క్యూ కట్టి, అర్జంట్ పనితో కడుపు పట్టుకొని కంగారుపడే టైప్ శాల్తీలా కనిపించారు" అంది వస్తోన్న నవ్వునాపుకుంటూ.


'ఛీ... ఛీ... యింత ఘోరంగా ఎలా ఆలోచిస్తావు? అయినా నేను మన బబ్లూగాడి కోచింగ్ సెంటర్ సీటు గురించి ఆలోచిస్తున్నాను."

"దానికెందుకంత ఆలోచన?" అంది మందమతి.

"ఎందుకేమిటి... మనం మొన్న నీచనికృష్ట కాన్వెంట్‌కు వెళ్తే ప్రిన్సిపాల్ పిచ్చేశ్వర్రావ్ ఏమన్నాడు?"

మందమతి కళ్ళు మూసుకుంది. వెంటనే ప్రిన్సిపాల్ మొహం... ఆయన మాటలు కనిపించి వినిపించాయి.

** ** **



"మిష్టర్ బలేరావు... మీ అబ్బాయికి మేము సీటివ్వాలంటే ముందు మీకు ఇంగ్లీష్ వచ్చి వుండాలి... ఐమీన్ మీకు, మీ ఆవిడకూ..."

"మరి నా స్టెప్నీకి అక్కర్లేదా?" అని నాలిక్కర్చుకున్నాడు బలేరావు. మందమతి విన్లేదు కాబట్టి బతికిపోయాడు.

"బీ సీరియస్" గుర్రుమన్నాడు ప్రిన్సిపాల్.

"నెక్స్‌ట్... పిల్లల చేత బండెడు హోంవర్క్ చేయించాలి. వాళ్ళకు తక్కువ మార్కులు వస్తే, మిమ్మల్ని క్లాసుకు పిలిపించి గోడకుర్చీ వేయిస్తాం" చెప్పాడు ప్రిన్సిపాల్.

వెంటనే ఆసీన్ విజువలైజ్ చేసేసుకున్నారు మందమతి బలేరావులు.

ఓరోజు హోంవర్క్ చేయనట్టు... ప్రిన్సిపాల్ తమని క్లాసురూమ్‌లోకి పిలిపించి గోడకుర్చీ వేయించినట్టు... తన పుత్రరత్నం ఆ సీన్‌ని చూస్తూ బాగా జరిగింది శాస్తి అని ఎంజాయ్ చేస్తున్నట్టు... తీరా చూస్తే తమ యం.డి., అతని పెళ్ళాం... పక్కింటి గోబేశ్వరరావ్, అతని పెళ్ళాం కూడా తమతోపాటు గోడకుర్చీ వేసినట్టు...

'థర్డ్‌వన్ కండీషన్' ప్రిన్సిపాల్ దగ్గినట్టు నటించి చెప్పాడు.

"దగ్గాసార్... కొరెక్స్ వాడండి" పుసుక్కున అనేసాడు. ప్రిన్సిపాల్ దగ్గర మెప్పుకొట్టెయొచ్చని.

కానీ, ప్రిన్సిపాల్ మాత్రం బ్రూకాఫీలో ఫినాయిల్ కలుపుకొని తాగినట్టు మొహంపెట్టి... "నేను మిమ్మల్ని ఎలర్ట్ చేయడానికి దగ్గాను. పాయింట్‌కు వస్తే... మీ అబ్బాయికి పుస్తకాలు మోసేందుకు ముందు ట్రయినింగ్ యిప్పించండి. అది కూడా మేము చెప్పిన స్ట్రాంగ్ కోచింగ్ సెంటర్‌లోనే."

"అదేమిటిసార్?" అయోమయంగా అడిగాడు బలేరావు.

"అదేమిటంటే అదే... అలా అయితే మీ అబ్బాయికి సీటివ్వనంతే" బుంగమూతి పెట్టి అన్నాడు ప్రిన్సిపాల్.

"దొం.... ముం... కొడ..." అర్థం అయ్యీ, అవ్వని భాషలో తిట్టింది మందమతి.

"ఇప్పుడు మీరు నన్ను తిట్టారా?" కోపంగా అడి గాడు ప్రిన్సిపాల్.

"కాదు సార్... మా ఆవిడ పూర్వీకులది దక్షిణాఫ్రికా. అక్కడి భాషలో తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. కానీ, అసలు సంగతి చెప్పండి."

"మరేంలేదు. స్ట్రాంగ్ కోచింగ్ సెంటర్‌లో పిల్లలకు బరువులు ఎత్తడం, వీపున మోయడం నేర్పిస్తారన్నమాట. భవిష్యత్తులో మీ పిల్లల పుస్తకాలు మోయలేక అవస్థపడే బాధ వుండదు. ఆ సెంటర్‌కు నేను రికమెండ్ చేస్తాను. అప్పుడిక మీ పిల్లల పుస్తకాలు మీరు మోయక్కర్లేదు."

"సార్... ఆల్రెడీ మావాడు ఓ సంవత్సరం మరో స్కూల్లో చదివి పుస్తకాలు మోసిన అనుభవం వుంది" అంటూనే నీరసంగా తలవూపి అలాగే అన్నాడు బలేరావు.

** ** **

ఫ్లాష్‌బ్యాక్‌లో నుంచి బయటకు వచ్చింది మందమతి.

"అయితే యిప్పుడు మన బబ్లుని స్ట్రాంగ్ కోచింగ్ సెంటర్‌లో జాయిన్ చేయాలా?"

"చేయకపోతే ఆ ప్రిన్సిపాల్ ముండావాడు సీటివ్వడు. ఇప్పటికే పుస్తకాల బరువు మోయలేక బబ్లు రెండు స్కూళ్ళు మారాడు. ఏమిటో... నా చిన్నప్పుడు ఓ పలకా బలపం... కాలేజీకి వెళ్ళాక నాలుగైదు పుస్తకాలు సరిపోయేవి" వాపోయాడు బలేరావు.

వెంటనే కర్తవ్యం గుర్తుకొచ్చి బబ్లుని పిలిచి, బతిమిలాడి, స్ట్రాంగ్ కోచింగ్ సెంటర్‌కు బరబరా ఈడ్చుకెళ్ళారు.

** ** **

"మీ అబ్బాయికి సీటు కావాలంటారు?" కోచింగ్ సెంటర్ ఓనర్ దున్నారావు అడిగాడు దర్పంగా బలేరావు వైపు చూస్తూ.

"కావాలనే వచ్చాంకదా" బలేరావు అన్నాడు.

"మీరు భలే చిలిపి" అంటూ బలేరావు వీపు మీద ఒక్కటిచ్చాడు పగలబడి నవ్వుతూ.

"చచ్చాన్రా గాడిద కొడకా" మనసులో గట్టిగా అనుకున్నాడు.

"రెండు నెలల కోచింగ్... మీవాడి వీపు బండ

రాయిలా తయారవుతుంది. ఫ్యూచర్‌లో బస్తాలు మోసి అయినా బతగ్గలదు" చెప్పాడు దున్నారావు.

వీడి పోలిక, వీడి మీసాలతో పాటు తగలెట్ట అనుకున్నాడు బలేరావు.

అడ్మిషన్ ఫీజు మూడువేలు. వారానికి అయిదు వందలు ఫీజు... రోజూ ఉదయం అరడజను, సాయంత్రం అరడజను కోడిగుడ్లు తినిపించాలి. దానికి ఖర్చు మీరే భరించాలి రూల్స్, కండిషన్స్ చెప్పుకుంటూ పోతున్నాడు దున్నారావు.

బలేరావుకు వినే ఓపిక నశించి, డబ్బు కట్టి రెండు చేతులూ జోడించి బబ్లూని అప్పగించి వచ్చాడు.

** ** **

డియర్ పిల్లకాయలూ...

మీరు త్వరలో కిలోల కొద్ది పుస్తకాలు వీపున మోయాలి. బండెడు పుస్తకాలు ఎలా బ్యాగులో కుక్కుకోవాలి... బ్యాగును ఎలా బియ్యం బస్తాలా వీపుకు వేలాడదీసుకోవాలి... తర్వాత దాన్ని ఎలా స్కూల్ వరకు మోయాలి... మోసినా బరువు వుండకుండా ఎలా బ్యాలెన్స్ చేయాలి. ఆ బరువు తాలూకు బాధని ఎలా తట్టుకోవాలో చెప్పి శిక్షణ మొదలెట్టాడు కోచర్.

బబ్లూ భయం మరొకటి కూడా. యిప్పుడే ఈ ట్రయినింగ్‌తో యిలా పుస్తకాల బరువు భారమై, వీపు బండ రాయి అయిపోతుంటే స్కూలుకు రోజూ ఈ బరువు ఎలా మోసుకెళ్ళాలి... బండెడు పుస్తకాలు అంతకన్నా మరో బండెడు ఎక్కువ హోంవర్క్. వెంటనే ఓ ఐడియా వచ్చింది.

ముందుగా బారులు తీరి వంగొని నడవండి ఇన్‌స్ట్రక్టర్ చెబుతున్నాడు.

తను ఆడుకునే క్రికెట్ బాల్‌తో ఆ ఇన్‌స్ట్రక్టర్ రెండు కాళ్ళ మధ్య గురిచేసి విసిరి కొట్టాలనిపించింది బబ్లూకు. ఇలాంటి వెర యిటీ ఆలోచనలు బబ్లూకు వళ్ళు మండినప్పుడు వస్తుంటాయి.

ఆ వంగొని నడిచే ప్రోగ్రామయ్యేక, వీపుమీద కిలో రెండు కిలోలబరువున్న పుస్తకాలు పెట్టి నడవమన్నారు. ఆ తర్వాత మూడు కిలోలు... నాలుగోరోజు నాలుగు కిలోలు.

బబ్లూకు రోజూ వళ్ళు మంటగా వుంది. వీపు దురదగా వుంది. ఉదయం నుంచి సాయంకాలం వరకూ ఈ శిక్షణ.

బబ్లూ ఈ బాధ భరించలేకపోతున్నాడు. ఏ కడప అంకుల్నో పట్టుకొని ఓ బాంబు అడిగి, ఆ కోచింగ్ సెంటర్ మీద, పిల్లలచేత బరువులు మోయించే స్కూళ్ళమీద నేయించాలనే కోరిక కూడా కలిగింది. ఒక్క బబ్లూనేకాదు చాలామంది పిల్లలకు కలిగిన ఆలోచనేయిది.

బబ్లూ భయం మరొకటి కూడా. యిప్పుడే ఈ ట్రయినింగ్‌తో యిలా పుస్తకాల బరువు భారమై, వీపు బండ రాయి అయిపోతుంటే స్కూలుకు రోజూ ఈబరువు ఎలా మోసుకెళ్ళాలి... బండెడు పుస్తకాలు అంతకన్నా మరో బండెడు ఎక్కువ హోంవర్క్. వెంటనే ఓ ఐడియా వచ్చింది. చెప్పాపెట్టకుండా పారిపోవాలని అనుకున్నాడు. కోచింగ్ సెంటర్ వెనకే ఎయిర్‌పోర్ట్ వుంది. ఆ గోడ దూకి పారిపోతే.

** ** **

ఆ కోచ్‌కు పిచ్చి టెన్షన్‌గా వుంది.

అది విమానాశ్రయం. ఇండియా నుంచి పదమూడేళ్ళ బాలలకు నిర్వహించే వెయిట్ లిఫ్టింగ్ బ్యాచ్‌కు ఆ కోచ్ నాయకత్వం వహిస్తున్నాడు. ప్రపంచ దేశాలన్నీ సిడ్నీలో జరిగే బాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొంటాయి. ఇండియా నుంచి నలుగురు జమాజెట్టీల్లాంటి పిల్లలను సెలక్ట్ చేసారు. నాలుగోవాడు కనిపించలేదు. ఫ్లయిటొచ్చింది. అనౌన్స్‌మెంట్ వినిపించింది. ఫ్లయిట్ మిస్సయితే పోటీ టైంకు అందుకోలేరు.

సరిగ్గా అప్పుడే బబ్లూ పారిపోయి అక్కడికి వచ్చాడు వగరుస్తూ...

టెన్షన్‌లో ఆ కోచ్ బబ్లూనే పోటీకి వచ్చే అబ్బాయి అనుకొని పదపద అన్నాడు.

** ** **

హిప్... హిప్... హుర్రే...

పదమూడేళ్ళ లోపు బాలలకు జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలో ఇండియా నుంచి వచ్చిన జట్టులోని బబ్లూ విజయకేతనం ఎగరేసాడు.

ప్రపంచ దేశాలన్నీ విస్తుపోయాయి. అమెరికా వాళ్ళ సి.ఐ.పనే, రష్యావాళ్ళ కె.జి.బి చేత, చైనా జపాన్ లాంటి దేశాలు కూడా తమతమ గూఢచార వర్గాలతో ఈ ఓటమి మీద ఎంక్వయిరీలు జరిపించాయి.

బబ్లూ విజయం వెనక వున్న కృషి, కోచర్ గొప్పతనమేమిటా అని ఆరా తీసాయి. అలా అలవోకగా ఏమాత్రం రిహార్సల్ లేకుండా బరువు ఎత్తిన బబ్లూ వెనక ఏ కోచరూ లేడని తేలిపోయింది.

కేవలం ఇండియాలో బండెడు పుస్తకాలు మోసిమోసి మంచి వెయిట్ లిఫ్టర్ అయ్యాడని తెలుసుకొని జుట్టు పీక్కున్నారు. వాళ్ళు కూడా ఆ మెథడే ఫాలో అవ్వాలనుకున్నారు. తథాస్తు.

** ** **

ఇండియాలో ప్రైమినిస్టర్ బబ్లూ గొప్పతనాన్ని తెగమెచ్చేసుకొని ప్రత్యేక పతకం యిచ్చాడు. ఆ వార్తని అన్ని టీవీలు కవర్ చేసాయి.

బబ్లూ మైకు ముందుకు వచ్చాడు. పారిపోయాడనుకున్న తమ బబ్లూ పతకంతో ఇండియా వచ్చాడని తెలిసి, టీవీ వంక ఆనందభాష్పాలతో చూస్తున్నారు బబ్లూ తల్లిదండ్రులు.

యింకా చాలామంది టీవీలను చూస్తున్నారు.

"అందరికి నమస్కారం...

ప్రతిష్టాత్మకమైన ఈ పతకాన్ని, ప్రధానమంత్రి అభినందనలను తిరస్కరిస్తున్నాను. ఇది నా గొప్పతనం కాదు. నేను వెయిట్ లిఫ్టర్ కావాలని అనుకోలేదు. అందుకు కృషి చేయలేదు. అలా కృషిచేసి ఆ రంగంలో పేరు తెచ్చుకున్నవాళ్ళకే ఈ పతకం, అభినందనలు దక్కాలి.

ఏ కృషీ లేకుండా నేను ఈ విజయం సాధించినందుకు సిగ్గుపడుతున్నాను. మా వీపుల మీద కిలోలకొద్ది పుస్తకాల సంచులు వేసి, పుస్తకాలు చదవమని, హోంవర్క్‌లు చేయమని చెప్పిన పెద్దలకు నా మనవి ఒక్కటే... మాకా పుస్తకాల మోత తగ్గించండి. మాకీ హోంవర్క్‌లూ, పనిష్మెంటులూ వద్దు... గోరుముద్దలు తింటూ పలకా బలపంతో అక్షరాలు దిద్దే మాకు..." అంటూ చొక్కా విప్పేసి, వీపు టీవీ కెమెరా వైపు పెట్టాడు.

వీపు ఎర్రగా కందిపోయి వుంది. అందరి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. 'ఇది మాకు పుస్తకాల బరువు శిక్ష. మా చేతులకు హోంవర్క్ శిక్ష. మాకు చదువే ఓ శిక్ష. ఆడుతూపాడుతూ చదువుకునే చదువే మాక్కావాలి. మాక్కావాలి... మాక్కావాలి" అంటూ తన మెడలోని పతకం ప్రధానమంత్రికి యిచ్చి ముందుకు నడిచాడు.

ప్రధానమంత్రి ఆలోచనలో పడ్డాడు. ప్రెసిడెంట్ ఈ విషయంలో సీరియస్ డెసిషన్‌కు వచ్చాడు.

ఆ తర్వాతేమవుతుంది?

పిల్లల పుస్తకాల బరువు తగ్గించే రోజొస్తుందా? ఎల్.కె.జీ పిల్లలు పలకా బలపంతో హాయిగా చిన్ని చేతులతో రాసుకునే రోజొస్తుందా? హోంవర్క్‌లేని ఆటవిడుపు చదువు అమ్మ ఒడిలాంటి బడి చదువు వచ్చే తరం పిల్లలకైనా సాధ్యమవుతుందా... షి..ట్...

# శుక్రగ్రహం రత్నం వజ్రం

రత్నాల సామ్రాట్ అయిన వజ్రం రసాయనక గుణాలతో సంపన్నమైనది, ప్రభావవంతమైనది, అమూల్యమైన ఖనిజరాయి. అద్భుత దృఢత్వం, సౌందర్యానికి దీనికి ఇదేసాటి. రసాయన విశ్లేషణ ప్రకారం వజ్రం ఒక టోసు కార్బను. కార్బను పారదర్శకము అతి కఠోరంగా ఉంటుంది. దృఢత్వం కారణంగా వజ్రం అని పిలవబడుతుంది. బొగ్గు కార్బను రూపం పారదర్శకం అయినప్పుడు దాని కఠోరత చర్మసీమల మీద పడుతుంది. దానినే వజ్రం అంటారు. ఇది ప్రపంచంలో చాలాచోట్ల పుడుతుంది. వజ్రం తెల్లరంగులో ఉంటుంది. దీని ద్వారా లేత కిరణాలు వస్తాయి. స్వయంగా ఆకాశ పుంజంలాగా ఉంటుంది.



జ్యోతిష్య నమ్మకం ప్రకారం వజ్రం శుక్రునికి ప్రతినిధి. ఒక వ్యక్తి కుండలిలో శుక్రగ్రహ స్థితి నిర్బలంగా ఉంటే వజ్రాన్ని ధరించి దౌర్భాగ్యాన్ని సౌభాగ్యంగా మార్చుకోవచ్చు. వృషభ, తులారాశివారు ఈ వజ్రాన్ని ధరించవచ్చు. వజ్రం చాలా గుణకరి. ఏ వ్యక్తి వజ్రాన్ని ధరిస్తాడో ఆ వ్యక్తి ముఖంలో తేజస్సు వస్తుంది. జీవితంలో ఏ విశేషం జరగాల్సి ఉందో అవి వెంటనే జరుగుతాయి. వజ్రం ధరించిన వ్యక్తి వారి వ్యతిరేక లింగాన్ని ఇట్టే ఆకర్షిస్తారు. దాంపత్య జీవనం సుఖమయమవుతుంది. వజ్రం ధరించడం వల్ల భూతప్రేతాల బాధ దూరమవుతుంది. మాయల నుండి చెడుమంత్ర ప్రభావాల నుండి కాపాడుతుంది. దాంపత్య సుఖాన్ని పెంపొందిస్తుంది. అకాల మృత్యుభయం ఉండదు. ఏ స్త్రీ అయితే తనకు మొదటి కాన్పులో పుత్రుడు కావాలనుకుంటుందో ఆమె గర్భధారణ సమయం నుండి వజ్రాన్ని ముఖ్యంగా వేలికి ధరించరాదని శుక్రాచార్యులవారు చెప్పారు. వజ్రం ఏ సమయాన ధరిస్తామో ఆ సమయం నుండి ఏడు సంవత్సరాల వరకు పూర్తి ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ, యు, వా, వి, వు, వీ, ఉ అనే అక్షరాలు మొదటగల వృషభరాశి వారు, రా, రి, రు, రె, రొ, ట, టి, టు, టీ అనే అక్షరాలు మొదటగల తులారాశివారు ఈ వజ్రాన్ని ధరించాలి.

ఏ నెలలోనైనా ఆరు నుండి 15 వరకు లేదా 24వ తేదీన పుట్టినవారు, మే 15 నుండి జూన్ 15 లోపు పుట్టినవారు, అక్టోబర్ 17 నుండి నవంబర్ 16లోపు పుట్టినవారు, ఆరు అదృష్టసంఖ్యగా గలవారు ఈ రత్నాన్ని ధరించవచ్చు.

వజ్రం వాటి ఉపరత్నాలైన తెల్ల సఫైర్, తెల్ల జిర్కాన్, తెల్ల టర్మలైన్‌ను కెంపు, ముత్యం, పగడం, కనకపుష్యరాగంతో ధరించకూడదు.

– డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి

SRI MAHARISHI RUDRAKSHA & NAVARATHNA EMPORIUM
No. : 13 Gayathri Towers,
Opp. Old Busstand,
Near Kesineni Tours & Travels
VIJAYAWADA-2
Phones : 0866-570199, 663335
BRANCH OFFICE :
6-3-354/10, Hindinagar,
Punjagutta, HYDERABAD.
Phone : 040-6636686, 6636696